పల్లె ప్రగతికి బ్రేకులు!

- కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిపై నీలినీడలు
- నిలిచిపోయిన భవనాల నిర్మాణాలు



పల్లివూరు రైతు భరోసా కేంద్రాన్ని అల్లుకున్న పొదలు



అర్ధాంతరంగా నిలిపోయిన రెయ్యిపాడు గ్రామ సచివాలయం

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్లెల ప్రగతికి బ్రేకులు పడ్డాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడం కోసం గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయించారు. అనేక భవనాలు నిర్మాణాలు పూర్తయి ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అసంపూర్తి పనులపై దృష్టి సారించకపోవడంతో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్‌క్లినిక్‌లు ముళ్ల పొదలు మధ్య దర్శనమిస్తున్నాయి.

విప్లవాత్మక నిర్ణయాలు..

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. జిల్లా, మండల కేంద్రాలు చుట్టూ తిరిగే పని లేకుండా ప్రజల కోసం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలతో పాలనను పల్లె ముంగిటకు చేర్చింది. వాటి కోసం భవనాల నిర్మాణం చేపట్టింది. వరి, వేరుశనగ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నిల్వ చేయడమే కాకుండా హెల్త్ క్లినిక్‌లలో బీఎస్సీ నర్సింగ్ చదివిన వారిని ఎంఎల్‌హెచ్‌పీలను నియమించి ఏఎన్‌ఎంలతో పని చేసేలా చేశారు. ఈ వ్యవస్థలన్నీ నేడు ఆదరణ కోల్పోతున్నాయి. పరిపాలన, వైద్యం ప్రజలకు చేరువ చేయాలని చేసిన సంకల్పం గాలిలో దీపంగా మారింది. దీంతో సకాలంలో సేవలందక రైతులు, అర్జీదారులు అవస్థలు పడుతున్నారు. మళ్లీ మండల, జిల్లా కేంద్రాలకు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వ్యవసాయం, వైద్యం పరంగా మెరుగైన సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన భవనాల నిర్మాణం ఆగిపోవడంతో పాత పంచాయతీ భవనాలు, తుఫాన్ షెల్టర్‌లు, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.

పలాస నియోజకవర్గంలో ఇలా..

పలాస నియోజకవర్గంలో ప్రజల ముంగిటకు సేలవలు తెచ్చే లక్ష్యంగా భవనాల నిర్మాణం ప్రారంభించారు. రూ.28.80 కోట్లతో 72 గ్రామ సచివాలయాలకు నిధులు మంజూరు కాగా 20 కేంద్రాల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మరో రూ. 22 కోట్లతో 72 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు ప్రారంభించగా వీటిలో 36 కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. రూ. 10.50 కోట్లతో 59 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు నిధులు మంజూరు చేశారు. 33 కేంద్రాలు పునాదుల్లోనే ఉన్నాయి. నిధులు ఉన్నా కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువై రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కొన్ని చోట్ల పునాదులకే పరిమితమైయ్యాయి. వజ్రపుకొత్తూరు మండలం పల్లివూరు, గోవిందపురం, పాతటెక్కలి ఆర్బీకేలు పూర్తి కాలేదు. రెయ్యిపాడు, పాతటెక్కలి, సచివాలయాలు గోడలకే పరిమితమైయ్యాయి. ప్రభుత్వం దృష్టి సారించి వీటిని పూర్తి చేస్తే ప్రజలకు సేవలందుతాయి.

ప్రజాధనం వృథా కాకూడదు



ప్రభుత్వం మారినంత మాత్రాన ప్రజలకు పనికొచ్చే భవనాల నిర్మాణం ఆపకూడదు. అభివృద్ధి పనులు నిలిచిపోతే ప్రజాధనం వృథా అవుతుంది. మా పంచాయతీలో భవనం నిర్మాణం మధ్యలోనే ఆపేశారు. ఉద్యానవన, వరి రైతులకు సేవలందించాల్సిన భవనం ముళ్లపొదల్లో ఉంది. ఇది దారుణం. తక్షణమే భవన నిర్మాణ పనులు చేపట్టి వినియోగంలోకి తేవాలి.

– మామిడి భాస్కరరావు, సర్పంచ్, పల్లివూరు

పనులు నిలిపి వేయడం తగదు



రైతు భరోసా కేంద్రం పూర్తి కాకపోవడంతో ఎరువులు, విత్తనాలు పరాయి పంచన దాచుకోవాల్సిన దుస్థితి ఉంది. శ్లాబ్ లెవిల్ వరకు నిర్మించి వదిస్తే ఎలా?. ప్రజలకు పనికొచ్చే అభివృద్ధి పనులు మధ్యలో నిలివేయడం సరికాదు. నిధులు ఉన్నా అధికారులు ఆర్‌బీకేల నిర్మాణం పూర్తి చేయడం లేదు. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

– ఎ.గోవిందరావు, సర్పంచ్, సైనూరు

రక్తదానంపై సామాజిక చైతన్యం అవసరం

- టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి



రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి: అత్యవసర సమయాల్లో ఎంతగానో ఉపయోగపడే రక్తం కోసం ప్రతిఒక్కరూ రక్తదానం చేసే విధంగా సామాజిక చైతన్యం కలిగి ఉండాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో రెడ్‌క్రాస్ సౌజన్యంతో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య తిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రక్తదానం కోసం యువత మరింత చైతన్యవంతం కావాలని కోరారు. శిబిరంలో 160 యూనిట్ల రక్తం సేకరించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధి చైతన్యకుమార్, వైద్య సిబ్బంది సునీత, వంశిక, ఎన్‌సీసీ అధికారి టి.మురళీమోహన్, అధ్యాపకులు డి.విష్ణుమూర్తి, ఆర్.శాంతికుమార్, ఎం.జయమన్మథరావు, బి.బలరాం, ఎస్టేట్ మేనేజర్ పిరియా రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు



టెక్కలి కాంప్లెక్స్ సమీపంలోని దుకాణంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టెక్కలి పరిసర ప్రాంతాల్లో కానైన్ డాగ్‌తో పోలీసులు తనిఖీలు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణతో సమీప ప్రాంతాలలో, ప్రైవేట్ బస్సులలో గంజాయ్ వంటివి రవాణా జరుగుతున్నాయనే దానిపై ఆ డాగ్‌తో తనిఖీలు చేపట్టారు. అలాగే బస్సులు, రైళ్ల బోగీలు, పాన్ షాపుల్లో సైతం తనిఖీలు నిర్వహించారు. గంజాయి వంటి నిషేధిత పదార్థాల రవాణాను అరికట్టే క్రమంలో తనిఖీలు చేస్తున్నామని టెక్కలి ఎస్‌ఐ రాము తెలిపారు.

ఉద్యోగికి సేవలతోనే గుర్తింపు



భగీరథ దొళాయి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: విధి నిర్వహణలో ఉద్యోగి చేసిన సేవలే గుర్తింపును ఇస్తాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండల ఇంజినీర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన భగీరథ దొళాయిని శనివారం స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, ప్రకాశరావు పట్నాయక్, ఎంపీడీవో కె.రామారావు, ఎంఈవో కురమాన అప్పారావు, సీడీపీఓ పి.నాగరాణి, మండల వ్యవసాయాధికారి టి.భార్గవి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్య పాల్గొన్నారు.

కౌన్సిల్ అంటే విలువలేదా?

- ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్‌-2 స్వర్ణమణి



మున్సిపల్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న వైస్‌ఛైర్‌పర్సన్ స్వర్ణమణి, ఇతర సభ్యులు

ఇచ్ఛాపురం: మున్సిపల్ సాధారణ సమావేశం ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ. రెండు కోట్ల కేటాయింపులో కౌన్సిల్‌కి తెలియజేయకుండా ప్రతిపాదనలు సిద్ధం చేయడం ఏమిటని వైస్ ఛైర్‌పర్సన్‌-2 లాబాల స్వర్ణమణి ప్రశ్నించారు. కౌన్సిల్ అంటే విలువలేదా అని నిలదీశారు. మున్సిపల్ అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో 11 అంశాలతో కూడిన ఎజెండాపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. బస్టాండ్‌లోని టాయిలెట్ల నిర్వాహణ అంశాన్ని తిరస్కరించగా మిగిలిన వాటికి సభ్యులు ఆమోదం తెలిపారు. ఎర్ర చెరువు ఆక్రమణకు గురవుతోందని తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బి.జగన్ సమావేశంలో ప్రస్తావించారు. రోడ్లపై పశువులు సంచరించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని వైస్‌ఛైర్‌పర్సన్‌-1 ఉలాల భారతిదివ్య కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ పాల్గొన్నారు.

మత్తుకు చిత్తు కావద్దు



మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దంటూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో గ్రీన్‌ఆర్మీ, ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ పాత బస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో డ్రగ్స్ వాడకాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. మానవహారం చేపట్టి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి నియంత్రణకు పోలీస్, ఎక్సైజ్ యంత్రాంగం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

కుల గణన కూడా చేయాలి

టెక్కలి: వచ్చే ఏడాది దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న జన గణనతో పాటు కుల గణన చేయాలని దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 1951 సంవత్సరంలో చేసిన ఎస్సీ, ఎస్టీల కుల గణన కేవలం చట్ట సభల్లో వారి స్థానాలను నిర్ణయించడానికేనని గుర్తు చేశారు. బీసీలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా పరిగణిస్తున్నారని.. అలా కాకుండా కుల గణన చేయాలని అన్నారు.

వ్యవసాయ పరికరాలు అందజేత

కవిటి: కవిటి ఉద్దానం ప్రాంతంలో ఉద్యానపంటల్లో అధికదిగుబడుల సాధించేలా రైతులకు సహకారం అందించాలని అధికారులకు ప్రభుత్వ విప్ బి.అశోక్ సూచించారు. రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో 90 శాతం రాయితీపై మంజూరు చేసిన బిందు తుంపర్ల సేద్యం పరికరాలను రైతులకు శనివారం పంపిణీ చేశారు. కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాలకు చెందిన ముందుగా ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న 100 హెక్టార్లకు సరిపడే పరికరాలను రైతులకు అందించినట్టు ఏపీఎంఐపీ పీడీ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. హెచ్‌ఓ పోలాకి మాధవీలత, ఏఈఓ బి.శ్రీకల్యాణ్, బి.శరణ్య ఉన్నారు.

గాయపడిన యువకుడు మృతి



నందిగాం: మండలంలోని నర్సిపురం జాతీయ రహదారిపై ఈ నెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెద్ద లవునిపల్లి గ్రామానికి చెందిన జడ్యాడ రాము (25) విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అందరితో ఎంతో కలివిడిగా ఉండే రాము మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

ప్రతి సోమవారం ఫిర్యాదుల పరిష్కార వేదిక

నందిగాం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం స్థానిక తహసీలార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తహసీల్దారు సోమేశ్వరరావు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. తహసీల్దారు ఆధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో మండల ప్రజానీకానికి ఉన్న సమస్యలు ఆర్జీల ద్వారా తెలియజేసి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

పింఛన్ల అందజేత

పలాస: స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష కేదారిపురంలో సామాజిక భద్రతా పింఛన్లు శనివారం పంపిణీ చేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వజ్రపుకొత్తూరు రూరల్: గుర్తు తెలియని జంతువు సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. ఉద్దానం, తీర ప్రాంతాల్లో రెండు రోజులుగా గుర్తు తెలియని జంతువు సంచరిస్తున్న నేపథ్యంలో ఆటవీశాఖాధికారులు ఒంకులూరు, అనకాపల్లి, అక్కుపల్లి, చీపురుపల్లి, కొండపల్లిమోట్టూరు గ్రామాల్లో శనివారం పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. గుర్తు తెలియని జంతువు కనిపించిన వెంటనే తమకు సమాచారం అందించాలని, ఎవరూ ఒంటరిగా ఆరుబయట తిరగరాదని, చీకటి ప్రాంతాల్లో ఉండరాదని సూచించారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యలో పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో కళాశాల ప్రతినిధులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు చేతుల మీదుగా నూతన పుస్తకావిష్కరణ జరిగింది. కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు ఎం.వి.బి.చంద్రశేఖర్, ప్రదీప్‌కుమార్ మహాపాత్రో, ఆరంగి దశరథ, కె.వి.చంద్రశేఖర్ తదితరులురాసిన 'ఆపరేటింగ్ సిస్టమ్స్'అనే పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.శ్రీరాములు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల అందజేత

కవిటి: కొత్తగా మంజూరైన పింఛన్లను రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ శనివారం పంపిణీ చేశారు. వీటితో పాటు డయాలసిస్ రోగులు ఇద్దరికి మంజూరైన పెన్షన్లు కూడా అందించారు. కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట ఎంపీడీవోలు పాల్గొన్నారు.

తిలక్ పరామర్శ

టెక్కలి: రావివలస పంచాయతీ వార్డు సభ్యురాలు కొర్రాయి శాంతి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ శనివారం పరామర్శించారు. శాంతి మృతికి పార్టీ తరఫున సంతాపం వ్యక్తం చేశారు. మృతురాలి భర్త కూర్మారావును ఓదార్చారు. సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, నాయకులు సర్లాన సుధాకర్ ఉన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

సోంపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్‌హబ్ సెంటర్లలో ఉపాధితో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్ కోర్సులో శిక్షణ అందజేయనున్నట్టు ప్రిన్సిపాల్ డి.రమణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్హత కలిగి 18 నుంచి 27 ఏళ్లలోపు వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. కోర్స్ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 95028 25143 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పోస్టల్ సేవలపై విద్యార్థులకు అవగాహన




బ్రాంచ్ పోస్టాఫీసు వద్ద విద్యార్థులు

పలాస: పోస్టాఫీసులో ప్రజలకు అందుతున్న సేవలపై రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా 3, 4 తరగతి విద్యార్థులను స్థానిక పోస్టాఫీసుకు తీసుకువెళ్లి పోస్ట్‌కార్డు, ఇన్లలప్ పోస్టు, రిజిస్టర్ పోస్టు, స్పీడ్ పోస్టు, మని ఆర్డర్, సేవింగ్ అకౌంట్‌పై బ్రాంచ్ పోస్ట్ మాస్టార్ అవగాహన కల్పించారు. ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి, ఉపాధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి శరత్, ఉపాధ్యాయులు అర్చన, కల్పన, జగదీశ్వరి, కిరణ్ ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఇచ్ఛాపురం: చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని వక్తలు అన్నారు. మాదక ద్రవ్యాలు, సైబర్‌నేరాల బారిన పడకుండా యువసూర్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాగ్రత్తలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి పి.దేవేంద్ర, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.రాంబాబు, ప్రిన్సిపాల్ సాదయ్య, ఐసీడీఎస్ పీవో నాగరాణి, న్యాయవాదులు విశ్వనాథం, నాగరాజుపాత్రో, కృష్ణమూర్తి, ట్రస్ట్ సభ్యులు దుర్గాప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీసు సిబ్బందికి గుర్తింపు



ఎస్పీ మహేశ్వరరెడ్డి నుంచి ప్రశం సాపత్రం అందుకుంటున్న కాశీబుగ్గ సీఐ మోహనరావు, కానిస్టేబుల్ ప్రదీప్

కాశీబుగ్గ: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కాశీబుగ్గ పోలీసు డివిజన్ పరిధికి చెందిన సిబ్బందికి గుర్తింపు లభించింది. దోపిడీ, మోటారు దొంగతనాల కేసుల్లో దొంగలను పట్టుకోవడంలో విశేష కృషి చేసిన కాశీబుగ్గ పట్టణ సీఐ దాడి మోహనరావు, కానిస్టేబుళ్లు ఈశ్వర్, ఉషాకిరణ్, ప్రదీప్, కామేష్, కిరణ్, నీలకంఠాలకు జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో శనివారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

సత్కారం..



కవిటి మండలంలోని మాణిక్యపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కాళిదాస్ సాహూ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సుమలత, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. జాతీయస్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిథ్యం వహించడం గొప్ప విషయమని కొనియాడారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ ఎం.తోటారావును సిబ్బంది అభినందించారు.

–కవిటి

ఆర్థిక సాయం..



ఉద్దానం గోపినాథపురం గ్రామానికి చెందిన కర్ని ఈశ్వరరావు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వైద్యానికి సుమారు రూ. పది లక్షలు ఖర్చవుతోందని వైద్యులు చెప్పారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ రూ.25 వేలు సేకరించింది. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి శనివారం అందజేసి అండగా నిలిచారు. సర్పంచ్..గురుస్వామి కర్ని శ్రీను, ఇతర స్వాములు రూ.15 వేలు సాయం అందంచగా, ఉద్దానం హెల్పింగ్ సొసైటీ రూ. మూడు వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు, రూ. పది వేలు సమకూర్చారు. సొసైటీ ప్రతినిధులు అర్జి గిరి, కర్ని శ్రీను, సైని వాంతి, కీలు కమల ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు

కౌన్సిల్ సమావేశం రసా భాసా!



కౌన్సిలర్ దువ్వాడ సత్యవతి మాట్లాడుతుండగా నిలబడి వాకౌట్‌కు ఆమోదం తెలుపుతున్న మిగిలిన సభ్యులు

కాశీబుగ్గ: ప్రోటోకాల్ ఉల్లంఘనపై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలచే ఎన్నుకోబడిన తమను కాదని..వేరే వారికి ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని నిలదీశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన జరిగింది. అయితే సభ్యులు పలు అంశాలపై నిలదీయడంతో సమావేశం రసా భాసాగా మారింది. సమావేశంలో అజెండాలో పెట్టిన నాలుగు అంశాలకు మాత్రమే అంగీకారం తెలుపుతూ ఇతర అంశాలను రద్దు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. ముందుగా ఏడో వార్డు కౌన్సిలర్ దువ్వాడ సత్యవతి మాట్లాడుతూ.. ప్రజలచేత ఎన్నుకోబడిన కౌన్సిలర్లుగా తాము ఉండగా.. మమ్మల్ని కాదని రౌడీలు, గూండాలతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేయించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ మాత్రం దానికి కౌన్సిలర్ పదవులు ఎందుకు, అజెండా ఎందుకు, మున్సిపల్ కార్యాలయం ఎందుకని అధికారుల తీరును ఖండించి వాకౌట్‌కు పిలుపునిచ్చారు. సమావేశంలో చుప్పులు, జంతికలు తినడానికి పిలిపిస్తున్నారా అని నిలదీశారు. 11వవార్డు కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో మెప్మా విభాగానికి చెందిన సీవో, ఆర్పీలు ప్రజలతో ఎన్నికైన తమను పిలవకుండా ఎటువంటి పదవులు లేని టీడీపీ నాయకులతో సమావేశాలు నిర్వహించి తమను అవమానపరచడం తగదన్నారు. 21వవార్డు కౌన్సిలర్ పప్పల ప్రసాద్, 14వార్డు కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అజెండా మొత్తం తప్పులు తడఖగా ఉందన్నారు. పెట్టిన అంశాలే మళ్లీ మళ్లీ పెడుతున్నారన్నారు. తమ వార్డుల్లో కౌన్సిలర్లతో సంబంధం లేకుండా అభివృద్ధి పనులకు టీడీపీ వారే టెండర్లు వేసి వారే కాంట్రాక్టులు తీసుకొని.. వారే శంకుస్థాపనలు చేసుకుంటున్నారని ఆరోపించారు. అలా అయితే తాము ఎందుకు ఉండాలని సమావేశంలో ఉండాలని ప్రశ్నించారు. తొమ్మిదో వార్డు కౌన్సిలర్ గుజ్జు జోగారావు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాయకుల వార్డుల్లో అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారైనప్పటికీ పనులు జరగడం లేదని.. ప్రజల ఇబ్బందులు పట్టించుకోవడం లేదన్నారు. మేదరవీధిలో వరదనీరు రోడ్డుపై పారుతూ ఇబ్బందులు పడుతున్నా పని చేయడం లేదన్నారు. ఐదో వార్డు కౌన్సిలర్ కర్రి మాధవరావు మాట్లాడుతూ.. 15వ ఆర్థిక నిధులను తమ వార్డుకు కేటాయించలేదన్నారు. 19వవార్డు కౌన్సిలర్ శిష్టు బృందావతి మాట్లాడుతూ.. శంకుస్థాపనల విషయంలో ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. కౌన్సిలర్లు లేకుండా పనులు చేసుకుంటున్నారని అన్నారు. 19 మంది కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు సమావేశం మధ్యలో వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ టి.రామారావు జోక్యం చేసుకొని వాకౌట్ చేయవద్దని కోరినప్పటికీ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వినలేదు. సమావేశంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్లు పిచ్చుకల అజయ్, దున్న నిర్మల, బడగల సుజాత, సవర సోమేష్, సుజాత త్యాడి, దువ్వాడ సంతోష్, రోణంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

గ్రామ పెద్దలకు సత్కారం



కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలను సత్కరిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: బైపల్లి గ్రామంలో వాడబలిజ కుల సంఘ సామాజిక భవనం, కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేసిన వాడబలిజ పూర్వపు కమిటీ కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలను స్థానికులు శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. భవనం రెండో అంతస్తును రూ. 34 లక్షలతో నిర్మించామన్నారు. దీనికి సాకారం అందించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ కార్యవర్గ సభ్యులను అభినందించారు. వాడబలిజ కుల సేవా సంఘ సభ్యులు మద్దు లక్ష్మీనారాయణ, మోస లోకనాథం, మద్దు రాంప్రసాద్, ఆమర గురుమూర్తి, పి.చంద్రశేఖర్, చీకటి కామేశ్వరరావు, మద్దు సుధీర్, కోనేరు కామేశ్వరరావు, కె.పాపారావు, బి.శివ ఉన్నారు.

ఘనంగా మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో మండల స్థాయి గ్రిగ్స్ పోటీలను మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు శనివారం ప్రారంభించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యమన్నారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. వివిధ పాఠశాలల జట్లు నియోజవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.

7న సుబ్రహ్మణ్యస్వామి షష్టి

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని 24వవార్డు పురుషోత్తపురం గ్రామంలో ఈనెల ఏడో తేదీన శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కమిటీ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజున మహాఅన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. కాగా అన్నదానం కోసం పండిత రాజేంద్రనాయుడు, లండ నాగరాజులు బియ్యం బస్తాలను అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వజ్రపుకొత్తూరు రూరల్: రిట్టపాడులోని రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం ప్రారంభించారు. రాష్ట్ర ట్రేడ్ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, పీరికట్ల విఠల్, వ్యవసాయ శాఖ సంచాలకులు ఎల్.వి.మధు, ఏవో కిరణ్ వాణి, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ సీతారామయ్య ఉన్నారు.

రఘువర్మను గెలిపించుకుందాం

కాశీబుగ్గ: రాబోయే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఏపీటీఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు బలపరుస్తున్న పాకలపాటి రఘువర్మను గెలిపించుకోవాలని ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారు. మందస మండలం కొత్తపల్లి పాఠశాలలో వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, మందస అధ్యక్షులు ఎస్.కిరణ్‌కుమార్, హెచ్‌ఎం గేణేశ్వరరావు, దామోదరం, చిత్రసేను, గోపాలకృష్ణ ఉన్నారు.